క్లుప్తంగా

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

పరిగి : కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావును సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం పరిగి సీపీఐ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పీర్‌మహ్మద్‌తో పాటు ఇతర నేతలు ఎమ్మెల్యేను కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చెన్నయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోనే ఉంటాం


మాట్లాడుతున్న ఎంపీ రంజిత్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటామని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుందామని కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉంటూ పార్టీ పిలుపు మేరకు పోరాటం చేద్దామని వివరించారు. కేసీఆర్ పాలనలో పది ఏళ్ల పాటు ఎలా అయితే ప్రజల్లో ఉన్నామో ఇప్పుడు కూడా అలానే ఉండాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల అందజేత


ప్లేట్లు అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి లక్ష్మీరాములు స్మారకార్థం వారి కుమారులు సాయికృష్ణ, శ్రీకాంత్‌లు బుధవారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రుల స్మారకార్థం చిన్న చిన్న సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా భావిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, నాయకులు గోపాల్, రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేటితో ముగియనున్న జాతర

అనంతగిరి: శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ కార్తీక మాస పెద్దజాతర ఉత్సవాలు గురువారంతో ముగిస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజల, అనంతరం 11గంటలకు స్వామి వారి పుష్కరిణిలో చక్రతీర్థ ఉత్సవంతో జాతర ముగుస్తుందని ఆయన చెప్పారు. జాతర సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకునే ప్రక్రియలో భాగంగా ఆలయానికి ఇచ్చిన 12 కోడెల బహిరంగ వేలంపాట మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

అనంతగిరి: నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వికారాబాద్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి జి.విజయేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల హక్కుల రక్షణ , నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు, ప్రజల సంక్షేమానికి పాటు పడుతుందని వారు ఆకాంక్షించారు. కొత్త ప్రభుత్వం రెవెన్యూ శాఖను పటిష్టపరిచి, గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించి, రెవెన్యూ ఉద్యోగుల విధులను వికేంద్రీకరించి ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకుంటుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నూతన నియామకం


నర్సింహారెడ్డి

బంట్వారం: సర్పంచ్‌ల సంఘం బంట్వారం మండల అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి మాలసోమారం (సర్పంచ్) ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో మెజార్టీ సర్పంచ్‌లు సమావేశమై నర్సింహారెడ్డిని సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేవంత్ పట్టుదలకు దైవం తోడు

- నేడు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం
- నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వెళ్లనున్న అభిమానులు

కొడంగల్ : నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ఓ ప్రణాళికబద్ధంగా పూజలు నిర్వహిస్తూ దైవానుగ్రహంతో పదవీ వరించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని అతి పురాతన గాడిబాయి శివాలయ ఆవరణలో తన సొంత ఖర్చులతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ పూజలు చేశాకే పీసీసీ అధ్యక్ష పదవీ చేపట్టారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి తన నివాసంలో చండియాగం అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో గావించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా రేవంత్‌రెడ్డి నేరుగా గాడిబాయి శివాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. మూడు మండలాల్లో ఓ పర్యాయం, రెండు మండలాలలో ఒక్కసారి మాత్రమే ప్రచారం చేశారు. మొక్కవోని పట్టుదలతో చేపట్టాల్సిన లక్ష్యాన్ని అధిగమించేందుకు రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ధ్వజస్తంభ పూజా కార్యక్రమంలో రేవంత్


కుటుంబ సభ్యులు పూజలు చేస్తున్న రేవంత్

రేవంత్‌రెడ్డికి సోదరులే పెద్ద బలగం

రేవంత్‌రెడ్డి ఎదుగుదలకు ఆయన సోదరులే పెద్ద బలగం.. ప్రతి విషయంలో ప్రోత్సాహం అందిస్తూ తోడ్పాటునందిస్తున్నారు. ఆయనకు ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. పెద్దన్న భూపాల్ రెడ్డి విశ్రాంత ఎస్ఐ, రెండో అన్న కృష్ణారెడ్డి సర్పంచుగా పనిచేశారు. మరో సోదరుడు తిరుపతిరెడ్డి కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మరో సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి యూఎస్‌లో స్థిరపడ్డారు. మరో ఇద్దరు సోదరులు కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారంలో స్థిరపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఆయన సోదరులు సలహా, సూచనలు అందిస్తూ, ఏ కార్యక్రమం చేపట్టినా క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు భారీ కార్యాచరణతో ముందుకు సాగుతుంటారు.

నా త్యాగం ఫలించింది

- తాండూరు ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించడం హర్షణీయం
- ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్


మాట్లాడుతున్న రమేష్ మహరాజ్

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానాన్ని మరోసారి త్యాగం చేయడం వల్ల కాంగ్రెస్ గెలిచిందని ఏఐసీసీ సభ్యులు, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో తాను చేసిన త్యాగం వృథా కాలేదన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు మనోహర్‌రెడ్డికి టికెట్ వచ్చిందన్నారు. దీంతో తాండూరు నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్తల సమష్టి కృషి వల్ల మనోహర్‌రెడ్డి గెలుపు సాధ్యమైందన్నారు. పార్టీకి ఓటు వేసి అండగా నిలబడిన ఓటర్లకు మనసారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ గాలి వీచిన తాండూరులో మాత్రం కాంగ్రెస్ పార్టీ గెలిపించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. గెలిపించిన పార్టీకి నమ్మకద్రోహం చేసి వెళ్లారని ఆరోపించారు. ఇప్పటి వరకు కరప్షన్‌లు, ఇసుక, మట్టి అక్రమ దందాలకు కేంద్రంగా తాండూరులో కమీషన్‌ల రాజ్యం నడిపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక అక్రమ దందాలకు అవకాశం ఉండదన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డి జిల్లా నుంచి గెలుపొందడంతో తాండూరు నియోజవకర్గం 5 ఏళ్లలో అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. గతంలో సీఎంలుగా కొనసాగిన నేతల జిల్లాలన్నీ అభివృద్ధి చెందాయని అన్నారు. రానున్న రోజుల్లో వికారాబాద్ జిల్లా అదే స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాకేష్, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మండలాల అధ్యక్షుడు, నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ మహరాజ్ తదితరులు ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాతకు ఘన నివాళి


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్, నాయకులు


మర్పల్లి మండల కేంద్రంలో..


కొడంగల్ రూరల్ : పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో


దోమ : బొంపల్లిలో నివాళులర్పిస్తున్న నేతలు


వికారాబాద్ అర్బన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు


తాండూరు రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


దౌల్తాబాద్: బాలంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు


పరిగిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


కుల్కచర్ల: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు


తాండూరు టౌన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్ అర్బన్: రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నివాసం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్‌తోనే నేడు అనేక మంది దళితులు రాజకీయాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి దళితుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిననాడే ఆయన ఆశయం నెరవేరుతుందన్నారు. ప్రజాప్రతినిధిగా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలను నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి అందేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, మైనార్టీ నాయకులు జాఫర్, దీపక్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా అంబేడ్కర్‌కు వర్ధంతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు నివాళులర్పించారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చెంగోల్, జినుగుర్తి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వికారాబాద్ అర్బన్‌లో..

వికారాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల రమేష్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన రాసిన రాజ్యాంగంతోనే ఎంతో మేలు జరుగుతున్నట్లు తెలిపారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్ : పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో, మండల పరిధిలోని గ్రామాల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 67వ వర్ధంతిని యువజన, దళిత బహుజన గ్రామిక యూనియన్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొడంగల్ పట్టణ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, పెద్ద నందిగామలో దళిత గ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి లింగం సాయిలు ఆధ్వర్యంలో, అన్నారం గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, మండలంలోని గ్రామాల్లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో యువకులు, మహిళలు, నాయకులు డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

దోమ : యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ రాములు, సర్పంచ్ కోళ్ల సురేశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొంపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక నేతలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేడ్కర్ అందరివాడని, అంటరానితనం , అసమానతలు, కుల వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు అంబేడ్కర్ అని అన్నారు. కార్యక్రమంలో బొంపల్లి ఉపసర్పంచ్ రఫీక్‌పాషు, మల్లేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, సమాచార హక్కు చట్టం మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం మర్పల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ,నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రామేశ్వర్ ,నాయకులు కలీమొద్దిన్ , రాములు యాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలకు పునరంకితం కావాలి

దౌల్తాబాద్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆలోచనలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని బాలంపేట సర్పంచ్ పార్వతమ్మ కోరారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని బాలంపేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశానికి దశ, దిశ నిర్దేశించారని కొనియాడారు. రాజ్యాంగ నిఘంటువును అనుసరించి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

పరిగిలో..

పరిగి: అంబేడ్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలో సమసమాజ స్థాపనకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

కుల్కచర్ల: అంబేడ్కర్ వర్ధంతిని సందర్భంగా కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ కూడలిలోని ఆయన విగ్రహానికి బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరుడు శ్రీనివాస రెడ్డి, హబీబ్‌లాలా, భీమయ్య, బాల్‌రెడ్డి, పటోళ్ల నర్సింహులు, ప్రభాకర్ గౌడ్, జిలాని తదితరులు నివాళులర్పించారు. తాండూరు దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత తాండూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్

మోమిన్‌పేట: దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దబ్బుని వెంకట్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రకాంత్, దాసు, నర్సింలు, రాజు, శ్రీనివాస్, ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.


పెద్దేముల్ మండల కేంద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు, తదితరులు


మోమిన్‌పేటలో.. నివాళులర్పిస్తున్న వెంకట్ తదితరులు


పాత తాండూరులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

శోభాయమానంగా పడిపూజ


ఈశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు

కుల్కచర్ల: మండల కేంద్రంలో కూర నిఖిల్ అయ్యప్పస్వామి స్వగృహంలో బుధవారం భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి అయ్యప్పమాలధారులు పెద్దఎత్తున హాజరయ్యారు. మాలధారులు భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు దివ్యాంగుల దినోత్సవం

బొంరాస్‌పేట: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆయా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిట్‌మెంట్స్ సీఆర్‌పీ శిరీష తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉ. 9గంటల నుంచి ప్రారంభం తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి

షాబాద్: విద్యార్థులు సోదరభావంతో మెలగాలని షాబాద్ వైస్ ఎంపీపీ జడలక్ష్మి, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి అన్నారు. బుధవారం వారు షాబాద్ జెడ్పీహెచ్ఎస్(బాలుర) పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఉపాహారాన్ని పరిశీలించి వడ్డించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి పౌరులని ప్రతీ విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్: స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ హైవే ప్రైవేటు లిమిటెడ్ సంస్థ మేనేజర్ విశ్వనాథ్‌రాజు అన్నారు. బుధవారం కడియాలకుంట తండాలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రతీ ఒక్కరు వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ బుజ్జి రాజు నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యెన్నంకు శుభాకాంక్షల వెల్లువ

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెలుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని షాద్‌నగర్ శివారులోని రసోయ్ హోటల్ వద్ద నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్ కుమార్‌రెడ్డి, నాయకులు చిల్కమర్రి రవీందర్‌రెడ్డి, జాంగారి రవి, అనిమి గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సోషల్' సైలెన్స్

ఎన్నికల ప్రక్రియ పూర్తి

దౌల్తాబాద్: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కొనసాగిన ప్రచారంతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా ముమ్మరంగా ప్రచార భేరి మోగించారు. సోషల్‌మీడియా ఇన్‌చార్జిలను నియమించి మరీ ప్రధాన పార్టీలన్నీ మేనిఫెస్టోలు, అభ్యర్థుల గుణగణాలు విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమాల వివరాలను వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తూ బిజీబిజీగా గడిపారు. 3న ఫలితాలు తేటతెల్లం కావడంతో సోషల్‌మీడియా స్తబ్దుగా మారింది. ఇన్ని రోజులు సోషల్‌మీడియాల ఇన్‌చార్జిలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం, కామెంట్ల రూపంలో వాదనలు చేసుకోవడం జరిగింది. ఒకరు పెట్టిన సోషల్ మీడియా పోస్టుకు ప్రత్యర్థి పార్టీల అనుచరులు స్పందిస్తూ విమర్శల రూపంలో కామెంట్లు చేసుకున్నారు. దానికి మళ్లీ ప్రతిస్పందనలు రావడం ఇలా వాద, ప్రతివాదనలు సోషల్‌మీడియాలో జోరుగా కొనసాగాయి. ఫలితాలు వెలువడిన అనంతరం ఓటమి చెందిన అభ్యర్థుల అనుచరుల వర్గం సైలెంట్ అయిపోయింది. గెలిచిన అభ్యర్థుల అనుచరులు విజయయాత్రల పేరిట అక్కడక్కడ డీజేలతో మోత మోగించారు. గెలుపోటములు సహజమని వాటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని యువత వివాదాలు సృష్టించుకోవద్దని కోరుతున్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల నాయకుడు ఆంజనేయులు


ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా ధాన్యం సేకరించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు కోరారు. బుధవారం ఎంపీపీ సత్యాహరిశ్చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు కొందరు నాయకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి రైతులను మోసం చేశారని అన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ... రైతులకు ఇబ్బంది కలుగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అవినీతికి ఆస్కారం లేకుండా ధాన్యం సేకరణ జరగాలని సూచించారు. కార్యక్రమంలో కుల్కచర్ల గ్రామ సర్పంచ్ సౌమ్యారెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాంలాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు మొగులయ్య, వెంకటయ్య, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్, వెంకటేష్ పాల్గొన్నారు.